మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | ఎడిటర్ : నంద కిషోర్ | సంపుటి : 08 | సంచిక : 80 | శనివారం | 30 - 08 - 2025 | పేజీలు: 8 | వెల: 4

జగన్ కోసమే మోదీ

## సీబీఐ గొంతు నొక్కారు



2లో..



ఉగ్రవాదంపై పోరులో ఆపరేషన్ సిందూర్

## ఓ సువర్ణాధ్యాయం

మన గళం, న్యూఢిల్లీ : ఉగ్రవాదంపై మానవాళి పోరాటంలో ఆపరేషన్ సిందూర్ ఓ సువర్ణాధ్యాయమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. స్వదేశీ ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ- రిపోర్టింగ్ వ్యవస్థను నిర్మించడంలో ప్రభుత్వ రంగ సంస్థల సహకారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. భారత్-పాకిస్తాన్ మధ్య సైనిక వివాదంలో ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ వ్యవస్థ కీలకపాత్ర పోషించింది. స్కోప్ ఎమినెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ, 2047

2 లో..

ప్రధాని మోదీకి రాహుల్

## క్షమాపణలు చెప్పాలి



మన గళం, న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర వివాదాస్పదమైంది. ఈ యాత్రలో ఓ వ్యక్తి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఫైర్ అయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా

2 లో..



రుషికొండ భవన నిర్మాణాలలో

# వైసీపీ ప్రజలను మోసం చేసింది

- గతంలో రుషికొండకు రాకుండా అడ్డుకున్నారు - పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు..

మన గళం, విశాఖపట్నం : విశాఖపట్నంలో పర్యటిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బిజీబిజీగా ఉన్నారు. సేనతో సేనాని కార్యక్రమంలో భాగంగా నాయకులతో వరుసగా భేటీ అవుతున్నారు.. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ శుక్రవారం రుషికొండలో పర్యటించారు. రుషికొండకు చేరుకున్న ఆయన అక్కడి భవనాలను పరిశీలించారు. పవన్ కల్యాణ్ వెంట పలువురు జనసేన ఎమ్మెల్యేలు అధికారులు ఉన్నారు. రుషికొండ టూరిజం భవనాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం పవన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రుషికొండ భవన నిర్మాణాలలో వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. టూరిజం భవనాల రెనొవేట్ చేస్తామని.. ఉన్నవి పడగొట్టి కొత్త భవనాలు కట్టారన్నారు. చెట్లను నరికేసి పర్యావరణాన్ని దెబ్బతీశారన్నారు. రుషికొండ భవనాల నిర్మాణంలో మట్టి అమ్ముకుని అవినీతికి పాల్పడ్డారని పవన్ కల్యాణ్ ఆరోపించారు. రూ. 450 కోట్లు ఖర్చు పెట్టిన భవనంలో అప్పుడే పెచ్చులు ఊడుతున్నాయన్నారు. ఇంజనీర్లతో రుషికొండ భవనాల సేఫ్టీ ఆడిట్ జరిపించాలని సూచించారు. గతంలో టూరిజం శాఖకు ఏడాదికి రూ. 7కోట్ల ఆదాయం వచ్చేది.. ఇప్పుడు ఏడాదికి రూ.కోటి కరెంట్ బిల్లులు చెల్లించాల్సి వస్తోందన్నారు. లేపాక్షి ద్వారా ఫర్నీచర్ కొన్నట్టు బిల్లులు చేసుకున్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గతంలో తమను రుషికొండకు రాకుండా అడ్డుకున్నారని గుర్తుచేశారు. గతంలోనూ రుషికొండ భవనాలను పరిశీలించారు పవన్ కల్యాణ్. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రుషికొండ భవనాల అంశం చర్చనీయాంశంగా



మారింది. ఏం చేయాలన్న దానిపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకులేదు. ఈ క్రమంలో ఇవాళ పవన్ మళ్లీ భవనాలను పరిశీలించడంతో ప్రాధాన్యత ఏర్పడింది.




విశాఖ బీచ్ రోడ్డులో

## డబుల్ డెక్కర్ బస్సులు


- విశాఖ బీచ్ రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులను జెండా ఊపి ప్రారంభించిన సీఎం
- అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి బస్సులో ప్రయాణం

మన గళం, విశాఖపట్నం : విశాఖపట్నంలో హాప్ ఆన్ హాప్ ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. విశాఖ బీచ్ రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులను జెండా ఊపి సీఎం ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి బస్సులో ప్రయాణించారు. ఈ హాప్ ఆన్ హాప్ ఆఫ్ పర్యాటక బస్సులు ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకూ బీచ్ రోడ్‌లో ప్రయాణించనున్నాయి. మొత్తం 16 కిలోమీటర్ల మేర పర్యాటక ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు తిరగనున్నాయి. ఆర్కే బీచ్ నుంచి బీచ్ రోడ్డు మీదుగా డబుల్ డెక్కర్ బస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయాణిస్తూ.. పర్యాటకులకు అభివాదం చేశారు. విశాఖ బీచ్ రోడ్డులో డబుల్ డెక్కర్



2 లో..

## విశాఖలో ఆర్టీసీ బస్సు దగ్ధం



- విశాఖలోని శాంతిపురం వద్ద బస్సులో చెలరేగిన మంటలు

మన గళం, విశాఖపట్నం : విశాఖలో ఆర్టీసీ బస్సు దగ్ధమైంది. ప్రయాణికులతో కూర్మన్నపాలెం నుంచి విజయనగరానికి వెళ్తుండగా నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోని శాంతిపురం వద్దకు రాగానే ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగాయి. ముందుగా పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేశారు. ప్రయాణికులందర్నీ దించేశారు. మంటలు వ్యాపించి అందరూ చూస్తుండగానే బస్సు కాలిపోయింది. పెట్రోల్ బంక్ పక్కనే

2 లో..

కేంద్ర ప్రభుత్వానికి

## సుప్రీంకోర్టు నోటీసులు



- రామసేతుకు జాతీయ హెూదాపై సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్
- విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు
- కేంద్ర సాంస్కృతిక శాఖ, పురావస్తు శాఖకు నోటీసులు

మన గళం డెస్క్ : రామసేతువును జాతీయ వారసత్వ కట్టడంగా ప్రకటించాలన్న డిమాండ్‌పై సుప్రీంకోర్టు కీలక ముందడుగు వేసింది. ఈ అంశంపై బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. నిర్దిష్ట సమయంలోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ స్వామి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) డైరెక్టర్, ఏఎస్ఐ తమిళనాడు ప్రాంతీయ డైరెక్టర్ ఈ నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. స్వామి తరఫున సీనియర్ న్యాయవాది విభా దత్తా మఖిజా, న్యాయవాది సత్య సబర్వాల్ వాదనలు వినిపించారు. రామసేతువును జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించే విషయంలో తన విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సుబ్రహ్మణ్యస్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రామసేతువుకు సంబంధించిన

2 లో..

మా అమ్మను పోలీసులు

## బెదిరిస్తున్నారు

- లిక్కర్ స్కాం.. పైలా దిలీప్ షాకింగ్ పిటిషన్

మన గళం, విజయవాడ : లిక్కర్ స్కాం కేసులో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ30 నిందితుడిగా ఉన్న పైలా దిలీప్, ఏసీబీ కోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశాడు. పైలా దిలీప్ తన పిటిషన్‌లో సంచలన ఆరోపణలు చేశారు. తన



2 లో..

## ఉగ్రవాదంపై పోరులో ఆపరేషన్ సిందూర్ ఓ సువర్ణాధ్యాయం

నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర గురించి మాట్లాడారు. ఆదాయం, లాభం వంటి కీలకమైన ఆర్థిక పారామితులలో ప్రభుత్వ రంగ సంస్థలు బాగా పనిచేశాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో మూడింట ఒక వంతు లాభాలను ఆర్జిస్తున్నాయని, గత దశాబ్దంలో ప్రభుత్వ రంగ సంస్థల నికర లాభం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు సుపరిపాలన, పారదర్శకత రంగంలో ప్రమాణాలను నిర్దేశించాయని ముర్ము తెలిపారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ప్రాముఖ్యతపై స్పందిస్తూ.. స్వయం సమృద్ధ భారతదేశాన్ని నిర్మించడంలో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశ రక్షణ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాద శిబిరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని.. భారతదేశంపై దాడి చేసే ప్రయత్నాలు విఫలమయ్యాయి. స్వదేశీ ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ వ్యవస్థ తన సామర్థ్యాన్ని ప్రదర్శించిందన్నారు. ఈ వ్యవస్థ సృష్టికి ప్రభుత్వ రంగ సంస్థలు దోహదం చేశాయని.. ఇది వారికి చాలా గర్వకారణంగా నిలుస్తుందన్నారు. ఆవిష్కరణలు, పెరుగుతున్న సాంకేతిక నైపుణ్యం ద్వారా జాతీయ భద్రతలో స్వావలంబన సాధించడంలో పీఎస్‌యూలు ప్రధాన పాత్ర పోషించాయని రాష్ట్రపతి నొక్కి చెప్పారు. వ్యవసాయం, మైనింగ్, అన్వేషణ, తయారీ, ప్రాసెసింగ్, సేవలు వంటి అనేక రంగాల్లో పీఎస్‌యూలు కీలక పాత్ర పోషించాయని.. మహిళల నేతృత్వంలోని అభివృద్ధి ప్రభుత్వ జాతీయ ప్రాధాన్యతల్లో ఒకటని రాష్ట్రపతి పేర్కొన్నారు.

## ప్రధాని మోదీకి రాహుల్ క్షమాపణలు చెప్పాలి



ఖండించారు. ఇందుకు గానూ మోదీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'అనుచిత వ్యాఖ్యలకు గానూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆయన తల్లి, దేశ ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలి' అని షా డిమాండ్ చేశారు. 'మోదీ తల్లి చాలా పేద కుటుంబంలో తన జీవితాన్ని గడిపారు. తన పిల్లలను అత్యున్నత విలువలతో పెంచారు. అలాంటి మనిషిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. దీన్ని దేశ ప్రజలు ఎప్పటికీ సహించరు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ రాజకీయాలు అత్యంత దిగజారాయి. కాంగ్రెస్ పార్టీ దాని పాత స్వభావాన్ని, సంస్కృతిని తిరిగి తీసుకొచ్చింది. దేశ రాజకీయాల్లో విషం నింపుతోంది' అంటూ షా మండిపడ్డారు.

## కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు

మతపరమైన, చారిత్రక ప్రాము ఖ్యతను గుర్తించి, దాని పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు. ఈ విషయంపై గత ఏడాది జనవరిలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వానికి మరిన్ని పత్రాలు సమర్పించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో, మే 13న మళ్లీ కేంద్ర సాంస్కృతిక మంత్రికి విజ్ఞప్తి చేసి, తాజాగా సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ వేశారు.

## విశాఖలో ఆర్టీసీ బస్సు దగ్ధం



ఉండటంతో అందరూ ఆందోళనకు గురయ్యారు. షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ప్రమాదం సమయంలో బస్సులో 130 మంది ఉన్నట్లు బస్సు కండక్టర్? సాయిబాబు తెలిపారు. వెనుక నుంచి వచ్చే ఆటో వాళ్లు, ఇతర వాహనదారులు పొగలు వస్తున్నాయి అని చెప్పారని అన్నారు. దీంతో వెంటనే సిగ్నల్ దగ్గరలో బస్సును ఆపేసి, ప్రయాణికులను దించేసినట్లు చెప్పారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదమూ జరగలేదని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ప్రాణహాని జరగలేదు: ప్రయాణికులకు ఎలాంటి ప్రాణహాని జరగలేదని ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు తెలిపారు. బస్సు సిబ్బంది వెంటనే గుర్తించి అప్రమత్తం చేశారని, ప్రమాదంపై విచారణ చేయిస్తున్నామని అన్నారు. విశాఖలో ఆర్టీసీ బస్సు దగ్ధం ప్రమాద సమాచారం తెలుసుకున్న రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కూర్మన్నపాలెం నుంచి విజయనగరం వెళ్తున్న బస్సులో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ వెంటనే అప్రమత్తమవటంతో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. ఘటనా స్థలంలో అధికారులు, పోలీసుల నుంచి మంత్రి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావుతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని మంత్రి సమీక్షించారు.

# విశాఖ బీచ్ రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులు

బస్సులను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. 24 గంటల పాటు ప్రయాణించేలా టికెట్ ఛార్జీని రూ.500 పెట్టారు. అయితే పర్యాటకుల సౌలభ్యం కోసం సగం మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రూ.250 రూపాయలకే 24 గంటల పాటు టికెట్టును వర్తింప చేసేలా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. పర్యాటకులంతా పర్యావరణ హితంగా వ్యవహరించాలి. మన తీరప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ప్రపంచ పర్యాటకుల్ని ఆకర్షించేలా ఈ బీచ్ లు నిర్వహించేందుకు పౌరులు సహకరించాలన్నారు. విశాఖను రాజధాని చేస్తామని గత పాలకులు చెబితే అవసరం లేదని మీరు తీర్పిచ్చారంటూ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రోడ్లపై గుంతలు పెట్టిన పాలకులు వాటిల్లోనే కొట్టుకు పోయారన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా, ఆసియా టెక్నాలజీ హబ్ గా ఎదగబోతోందన్నారు. విశాఖలో డేటా సెంటర్, సీ కేబుల్ వేస్తారు. ఈ కేబుల్ ద్వారా విశాఖతో మిగతా ప్రపంచం అనుసంధానం అవుతుందన్నారు. భారత్ కే టెక్నాలజీ హబ్ గా విశాఖ ఎదుగుతు ఒదన్నారు. మహిళలకు సురక్షితమైన నగరంగా విశాఖ ఎంపికైందని.. ఢిల్లీ, ముంబై, బెంగుళూరు, చెన్నై నగరాలతో పోటీ



పడుతోందని చంద్రబాబు పేర్కొన్నారు.

## మా అమ్మను పోలీసులు బెదిరిస్తున్నారు

తల్లిని పోలీసులు బెదిరిస్తున్నారని పేర్కొన్నాడు. తాము నివాసంగా ఉండే ఇంటి నిర్మాణానికి లిక్కర్ స్కాం డబ్బు ఉపయోగించామని ఒప్పుకోవాలంటూ పోలీసులు ఒత్తిడి చేస్తున్నారని వెల్లడించాడు. తనపై దుష్ప్రచారం చేస్తూ కుటుంబాన్ని మానసికంగా వేధిస్తున్నారన్న ఆరోపణలు చేశాడు. ఈ పిటిషన్‌పై స్పందించిన ఏసీబీ కోర్టు, సంబంధిత పోలీసులకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కేసులో వాదనలు విన్న అనంతరం, తదుపరి విచారణను సెప్టెంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. గత కొన్నిరోజులుగా ఆంధ్రప్రదేశ్‌ను కలకలం రేపుతున్న లిక్కర్ స్కాం కేసులో ఇప్పటికే పలువురు అధికారులు, రాజకీయ నేతలు, వ్యాపారులు విచారణను ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో పెద్ద మొత్తంలో స్కాం జరిగినట్లు బయటపడిన నేపథ్యంలో విచారణ మరింత వేగవంతమవుతోంది.

## మరో అల్పపీడనం ఇక నాన్‌స్టాప్ వానలే వానలు

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే నెల 2వ తేదీ తర్వాత వర్షాల ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. సెప్టెంబర్ 2 తర్వాత బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని.. దాని ప్రభావంతో ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయన్నారు విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం అధికారి జగన్నాథకుమార్.. తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ వర్షాలు కొనసాగుతాయని చెప్పారు. కాగా.. ఏపీ, తెలంగాణలో వచ్చే 24గంటల్లో ఎలాంటి వాతావరణం ఉండబోతోంది?.. ఎక్కడెక్కడ వర్షాలు పడే అవకాశం ఉంది?.. అనే వివరాలను తెలుసుకోండి.. ఏపీ, తెలంగాణకు వాతావరణ శాఖ మరోసారి వర్షసూచన చేస్తోంది. ముఖ్యంగా.. బంగాళాఖాతంలోని అల్పపీడనం ప్రభావంతో ఏపీలోని రెండు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చింది. అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తోంది. ఈ రెండు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు కొన్ని చోట్ల పిడుగులు పడే చాన్స్ ఉందని తెలిపింది. మరోవైపు.. ఏపీలోని 11 జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది. ప్రకాశం, నెల్లూరు, కడప, శ్రీసత్యసాయి, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, విశాఖపట్నం, అల్లూరి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం.. ఈ 11 జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.




తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇప్పటికే భారీ వర్షాలు పడుతుండగా.. ఇప్పుడు మరికొన్ని జిల్లాలకు వాతావరణ శాఖ వెవీ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. తెలంగాణలోని 24జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ ఇచ్చింది. ఆదిలాబాద్, కొమురంభీం, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కామారెడ్డి, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, హనుమకొండ, వరంగల్, జనగామ, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, నారాయణపేట్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

## సుగాలి ప్రీతి కేసును పవన్ కల్యాణ్ పట్టించుకోవడం లేదు

**- కేసును పవన్ పట్టించుకోవడం లేదని సుగాలి ప్రీతి తల్లి ఆరోపణ - పవన్ కల్యాణ్ వల్లే ఈ కేసు వెలుగులోకి వచ్చిందన్న జనసేన**

మన గళం, అమరావతి : కర్నూలుకు చెందిన సుగాలి ప్రీతి హత్య కేసు వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ కేసును పట్టించుకోవడం లేదని ప్రీతి తల్లి పార్వతి చేసిన ఆరోపణలపై జనసేన పార్టీ ఘాటుగా స్పందించింది. పవన్ కల్యాణ్ అనే వ్యక్తి గొంతెత్తకపోయి ఉంటే, ఈ కేసు ఎప్పుడో మరుగున పడిపోయేదని పేర్కొంది. సాయం పొందిన వారు కృతజ్ఞత చూపకపోవడం కూడా తప్పే అవుతుందని వ్యాఖ్యానించింది. జనసేన విడుదల చేసిన ప్రకటన ప్రకారం, 2017 ఆగస్టులో సుగాలి ప్రీతి హత్య జరగ్గా, ఈ ఘటన 2019 డిసెంబర్‌లో తొలిసారి పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. 2019 ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, బాధితురాలి తల్లిదండ్రులు పార్టీ కార్యాలయానికి వచ్చి మొరపెట్టుకోగానే పవన్ చలించిపోయారని, వారికి న్యాయం జరిగే వరకు పోరాడతానని హామీ ఇచ్చారని జనసేన గుర్తు చేసింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ కేసుపై అసెంబ్లీలో



చర్చించాలని, లేదంటే కర్నూలులో భారీ నిరసన చేపడతామని హెచ్చరించిన విషయాన్ని ప్రస్తావించింది. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో, 2020 ఫిబ్రవరి 12న 'ర్యాలీ ఫర్ జస్టిస్' పేరుతో పవన్ కల్యాణ్ కర్నూలులో భారీ ర్యాలీ నిర్వహించారని జనసేన తెలిపింది. ఆ సభలో సుగాలి ప్రీతి తల్లి పార్వతి మాట్లాడుతూ, తమ బిడ్డకు న్యాయం కోసం గళం విప్పిన మొదటి నాయకుడు పవన్ కల్యాణే అని ఎన్నోసార్లు చెప్పారని పేర్కొంది. పవన్ ఒత్తిడి కారణంగానే నాటి వైసీపీ ప్రభుత్వం 2020 ఫిబ్రవరి 27న కేసును సీబీఐకి బదిలీ చేస్తూ జీవో జారీ చేసిందని వివరించింది. అయితే, జీవో ఇచ్చి చేతులు దులుపుకోవడం వల్లే సీబీఐ విచారణ ముందుకు సాగలేదని జనసేన ఆరోపించింది. అధికారంలోకి వచ్చాక కూడా పవన్ ఈ కేసును మర్చిపోలేదని, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రీతి తల్లిదండ్రులను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారని తెలిపింది. విచారణ వేగవంతం చేయాలని హోంమంత్రి అనితకు సూచించారని, ఆమెను కలవమని బాధితులకు చెప్పారని పేర్కొంది.

## జగన్ కోసమే మోదీ సీబీఐ గొంతు నొక్కారు

మన గళం, అమరావతి : తన చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విషయంలో ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి జగన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీకి జగన్ దత్తపుత్రుడని, అందుకే జగన్‌ను, ఆయన సోదరుడు అవినాశ్ రెడ్డిని కాపాడటం కోసం మోదీ సీబీఐ గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. వివేకా హత్య కేసు దర్యాప్తును ప్రస్తావిస్తూ, ఈ కేసులో మళ్లీ విచారణ ఎందుకు చేపట్టరని ప్రభుత్వాన్ని షర్మిల సూటిగా ప్రశ్నించారు. "వై నాట్" అంటూ నిలదీశారు. ఇన్నేళ్లుగా న్యాయం కోసం పోరాటం చేస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా కుమార్తె సునీత చేస్తున్న పోరాటంలో పూర్తి న్యాయం ఉందని, ఆమెకు తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ పనితీరుపై షర్మిల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "సీబీఐ అనేది మోదీ చేతిలో ఒక కీలుబొమ్మగా మారిపోయింది. నిజంగా సీబీఐ చిత్తశుద్ధితో పనిచేసి ఉంటే ఈపాటికే దోషులకు శిక్ష పడేది" అని అన్నారు. హత్య జరిగినప్పుడు సంఘటనా స్థలంలో అవినాశ్ రెడ్డి ఉన్నారని చెప్పడానికి గూగుల్ మ్యాప్ లొకేషన్లతో సహా బలమైన ఆధారాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇన్ని సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ, అవినాశ్ రెడ్డిని కాపాడటానికే దర్యాప్తును నీరుగారుస్తున్నారని ఆమె ఆరోపించారు. సీబీఐ దర్యాప్తు సరిగ్గా జరగడం లేదని సునీత చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉందని షర్మిల పేర్కొన్నారు.



## వినాయకుడికి ఎంపీ నాగరాజు పూజలు



మనగళం, కర్నూలు సిటీ : విఘ్నేశ్వరుడి కరుణకటాక్షాలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆకాంక్షించారు. కర్నూలు నగరంలోని ఎన్.ఆర్ పేటలో శేషయ్య సాయి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ స్వామివారికి హారతి ఇచ్చి కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు ఎంపీ నాగరాజు ను సత్కరించారు.

## నందమూరి హరికృష్ణకు నివాళులర్పించిన ఎంపీ నాగరాజు



మనగళం, కర్నూలు సిటీ : మాజీ రాజ్యసభ సభ్యులు, టీడీపీ నేత నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆయనకు నివాళులర్పించారు. హరికృష్ణ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా, మంత్రిగా, ఎమ్మెల్యేగాగా ప్రజలకు విశేష సేవలు అందించారన్నారు. నాడు రాజ్యసభలో తెలుగులో మాట్లాడే అవకాశం ఇవ్వనందున సభలో ఆయన ధ్వజమెత్తిన రోజును తెలుగు ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్న ఎంపీ, రాజకీయ నాయకుడిగానే కాకుండా తన విలక్షణమైన నటనతో ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు.

## 7వ తేదీ లోపు ప్రభుత్వ క్వార్టర్స్ లో అక్రమంగా నివసిస్తున్న వ్యక్తులు ఖాళీ చేయాలి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : నగరం లోని ఏబీసీ క్యాంపుల్లో ఉన్న ప్రభుత్వ క్వార్టర్స్ లో అక్రమంగా నివసిస్తున్న వ్యక్తులు సెప్టెంబర్ నెల 7 తేదీ లోపు ఖాళీ చేయాలని జిల్లా యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు ఏబీసీ క్యాంపుల్లో ఉన్న ప్రభుత్వ క్వార్టర్స్ లో ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఏ,బీ,సీ క్యాంపుల్లోని ప్రభుత్వ క్వార్టర్స్ లో అక్రమంగా నివసిస్తున్న వారు సెప్టెంబర్ 7వ తేదీ లోపు ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరించారు. ఖాళీ చేయని పక్షంలో రెవెన్యూ, ఆర్ అండ్ బీ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులతో కూడిన బృందం ద్వారా ఖాళీ చేయించడం జరుగుతుందని అధికారులు హెచ్చరించారు.

## సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి



మనగళం, కర్నూలు సిటీ : ఉద్యోగ ,ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులు ఐకమత్యంగా హక్కుల సాధనకు సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి గౌస్ దేశాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎండి అంజిబాబు లు పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని పాత బస్తీ నందు గల జిబి ఫంక్షన్ హాల్ లో సీఐటీయూ నగర మూడవ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జండాను సీనియర్ నాయకులు కేవీ సుబ్బయ్య ఆవిష్కరించారు. అనంతరం మాజీ నగర అధ్యక్షులు కే రాజగోపాల్ చిత్రపటానికి ,నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సంతాపాన్ని ఎస్ ఎం డి షరీఫ్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన మహాసభలలో ముఖ్య అతిథులుగా హాజరైన గౌస్ దేశాయ్, ఎండి అంజిబాబులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను ,ఒక్క కలం పోటుతో దాన్ని తుడిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పని గంటలు ఎనిమిది గంటల నుండి 10, 12 గంటల వరకు పెంచాలని ఏప్రిల్ నెలలో జరిగిన కేంద్ర క్యాబినెట్ చర్చలలో తీర్మాణం చేశారన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఆదాని ,అంబానీలకు ఉడిగం చేయడం కోసం పని గంటలను పెంచుతోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ఇవ్వాల్సిన వాటాలపై, పోలవరం ప్రాజెక్టుపై, రాజధాని అమరావతి అభివృద్ధిపై , విభజన హామీలపై కూటమి సర్కార్ ఊసెత్తడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విభజన హామీలు, ప్రత్యేక హోదాపై గత వైసీపీలానే కూటమి ప్రభుత్వం వ్యవహారిస్తుందన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. మహాసభలలో సీఐటీయూ నగర అధ్యక్షులు డి అబ్దుల్ దేశాయ్, ఉపాధ్యక్షులు రాజశేఖర్, మహమూద్ ఎస్డి కాజా పాషా , నగర కార్యదర్శి మారెళ్ళవిజయ రామాంజనేయులు, నగర సహాయ కార్యదర్శి ,కే రామకృష్ణ, సాల్మన్ రాజు ,రవి, వి నాగస్వాములు ,కుమార్, బి రాంబాబు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు నాయకులు నాగసుంకన్న, నో మేశ్వరి, సరిత, కళాకారులు, వివిధ సంఘాల, యూనియన్ల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి




మనగళం కర్నూలు సిటీ : సీఐటీయూ కర్నూలు మండలం మహాసభలు సెప్టెంబర్ 7వతేదీన, జిల్లా మహాసభలు 27,28వ తేదీల్లో నిర్వహిస్తున్నామని, కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలు నగరంలోని కార్మిక కర్షక భవన్ నందు సీఐటీయూ కర్నూలు మండల అధ్యక్షులు హుస్సేనయ్య అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్ మాట్లాడుతూ బీజేపీ 11 సంవత్సరాల పాలనలో పెట్టుబడిదారులు, కార్పొరేట్ల కోసం కార్మిక చట్టాలలో అనేక మార్పులు చేసిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పుతూ కార్మికుల పొట్ట కొడుతుందన్నారు. స్కీం వర్కర్లను నేటికీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే పరిస్థితి లేదన్నారు. చాలీ చాలని వేతనాలు ఇచ్చి వెట్టి చాకిరి చేయిస్తుందని విమర్శించారు. నేటికీ అసంఘటిత కార్మికులకు సమగ్రమైన చట్టం రూపొందించడంతో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో మండల జిల్లా మహాసభలు జయప్రదం చేసి భవిష్యత్తులో బలమైన కార్మిక చట్టాల కోసం కార్మికులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి బీసన్న, మండల నాయకులు రాఘవేంద్ర, చెన్నయ్య, రమణ, ఏసు, ప్రభాకర్, రామయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించండి




**- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

మనగళం, కర్నూలు సిటీ : సాంకేతికపరమైన ఇబ్బందులు రాకుండా ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా డిఈఓ ను ఆదేశించారు. శుక్రవారం మెగా డీఎస్సీ 2025 కు సంబంధించి నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఉన్న శ్రీనివాస బీఎడ్ కాలేజీలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వెరిఫికేషన్ గురించి అధికారులతో మాట్లాడి వివరాలపై ఆరా తీశారు. సర్వర్ సమస్యలు లేకుండా, నిరంతర విద్యుత్ సౌకర్యంతో హై ఇంటర్నెట్ స్పీడ్ తో వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులకు ఎక్కడా ఇబ్బందులు ఎదురు కాకుండా చూసుకోవాలన్నారు. జాప్యం కాకుండా ధ్రువీకరణ పత్రాల పరిశీలన వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్టిఫికెట్ల పరిశీలనకి సంబంధించి ఏరోజుకారోజు వ్యక్తిగత లాగిన్లలో సమాచారం అందుతుందని డీఈఓ శామ్యూల్ పాల్ కలెక్టర్ కి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు అబ్రహాం, ప్రతాపరెడ్డి,కడప ప్రాంతీయ సంచాలకులు శామ్యూల్, శ్రీనివాస బీఎడ్ కాలేజీ ఇంచార్జి, హౌసింగ్ పీడీ చిరంజీవి, నంద్యాల డీఈఓ జనార్ధన్ రెడ్డి, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లి రైతులకు మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలి

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లాలో పత్తి తర్వాత అత్యధిక పంటగా ఉల్లి ఉందని, క్వింటాకు మద్దతు ధర రూ. 2 వేలు ప్రకటించి ఉల్లి రైతును ఆదుకోవాలని సీపీఎం ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ మేరకు శుక్రవారం కర్నూల్ కొత్త బస్టాండ్ వద్ద ఉన్న మార్కెట్ యార్డును సందర్శించి ఉల్లి రైతులతో మాట్లాడడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య లకు సీపీఎం నాయకులు విన్నవించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి యస్ రాధాకృష్ణ, యం డి ఆనంద్ బాబు, టి రాముడు, జిల్లా కమిటి సభ్యులు వై నగేష్ రైతులను ఆదుకోవాలని వినతి పత్రం అందజేసి సమస్యలను వివరించారు. జిల్లాలో అత్యధికంగా వేసిన రెండవ పంటగా ఉల్లి ఉందని, అలాంటి ఉల్లి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కోడుమూరు మండలం గోరంట్ల నుండి మాధవస్వామి అనే రైతు నాలుగు రోజుల క్రితం 39 బస్తాలను మార్కెట్కు తీసుకుని వచ్చి, పట్టి రాసే దిక్కు లేక, రోజు ఆరబోసి ఎత్తుకునేందుకు సహితం కూలీ పెట్టుకోలేక తన ఉల్లిగడ్డలను మార్కెట్లోనే పారబోసి ఇంటికి వెళ్లిపోయాడని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని, మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్ ను కోరారు.

## తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : తెలుగు భాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం తెలుగు భాష దినోత్సవం సందర్భంగా దివంగత గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి డీఆర్వో వెంకట నారాయణమ్మ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు 1863వ సంవత్సరం ఆగస్టు 29వ తేదిన శ్రీకాకుళం జిల్లాలో జన్మించారని, తెలుగు భాషకు చేసిన సేవలకు గుర్తుగా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. గిడుగు రామ్మూర్తి "వ్యవహారిక తెలుగు"కు నాంది పలికిన మహనీయులు, తెలుగు భాషా అభివృద్ధికి అపూర్వమైన సేవలు అందించారని గుర్తుచేశారు. ఆ రోజుల్లో తెలుగులో ఉన్న గద్య భాగం చాలా కఠినంగా ఉండేదని, అటువంటి సమయంతో గిడుగు రామ్మూర్తి ఇతరలతో కలిసి ఉద్యమాలు నడిపి తెలుగును వ్యవహారిక భాషగా చేయడానికి ఎంతో కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ లోని వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలకు 15,000/- విరాళం.



మన గళం సంజామల : సంజామల పట్టణం లో వినాయక చవితి ఉత్సవాలకు 15,000 వేల రూపాయలు టీడీపీ యువనాయకుడు,అడ్వకేట్ గాలేసాహెబ్ అల్లిహుస్సేన్ శుక్రవారం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలల్లో జరిగే ప్రతి పండుగను కులాలకు అతీతంగా జరుపుకోవాలి అని, గణేష్ ఉత్సవం లో అందరు పాల్గొని విజయవంతం చేయాలనీ అల్లిహుస్సేన్ యువతకు పిలుపునిచ్చారు. గణనాథుని ఆశీస్సులు బనగానపల్లె నియోజకవర్గ ప్రజలమీద ఎల్లప్పుడూ ఉండాలని, ఈ సంవత్సతం వర్షాలు బాగా పడి, రైతుల ఇంటిలో ధాన్యం, సిరులోలకాలని, రైతులు ఎప్పుడు ఆనందంగా ఉండాలని, తను కోరుతున్నాని అల్లిహుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమం లో సంజామల గ్రామం సాలెపేట యువత పాల్గొన్నారు.

## మరమ్మత్తులు త్వరితగతిన పూర్తి చేయాలి



**- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ**

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్లలో అవసరమైన మరమ్మత్తులు తక్షణమే చేపట్టాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ ఆదేశించారు. శుక్రవారం ఆయన నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 9 మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ రెవెన్యూ, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్య విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ల ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పైకప్పులపై వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే హోర్డింగుల నాణ్యత, స్థితిగతులను పట్టణ ప్రణాళిక విభాగం క్రమం తప్పకుండా పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్.ఓ. జునైద్, ఆర్.ఐ. రాజు, తిప్పన్న, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో మరో మూడు నెలలు పాటు పొడిగిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆగస్టు 31 వరకు అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు, 1 సెప్టెంబర్, 2025 నుండి 30 నవంబర్, 2025 వరకు లేదా నూతన అక్రిడేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని తెలిపారు.

# ఉల్లి రైతులకు అండగా నిలువండి

- నాణ్యత సాకుతో అన్యాయం చేయొద్దు
- విక్రయాలు సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి
- ఉల్లి ధర అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



మనగళం, కర్నూలు సిటీ : రైతులకు నష్టం జరక్కుండా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఉల్లి విక్రయాలు సక్రమంగా జరిగేలా మార్కెటింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య తో కలిసి జిల్లా కలెక్టర్ కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఉల్లి రైతులతో మాట్లాడారు. ఉల్లి నాణ్యతను పరిశీలించారు. పంట దిగుబడి ఎంత వచ్చింది... గతేడాది ఎంత రేట్ వచ్చింది... ఈ ఏడాది ఎలా ఉంది అని ఆరా తీశారు. వర్షాల వల్ల పంట దెబ్బ తినిందని, రేట్ చాలా తక్కువగా ఉందని రైతులు కలెక్టర్ కు వివరించారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని కలెక్టర్ రైతులకు చెప్పారు. అనంతరం మార్కెట్ కమిటీ, మార్కెటింగ్, ఉద్యాన శాఖ అధికారులు, ట్రేడర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మార్కెట్ యార్డ్ కు ఎంత పరిమాణంలో ఉల్లి వస్తోంది, ఎంతమంది లైసెన్స్ వ్యాపారులు ఉన్నారు, అమ్మకాల వివరాల గురించి అధికారులతో ఆరా తీశారు. రైతులకు ప్రయోజనం కలిగేలా ఉల్లి విక్రయాలు సక్రమంగా జరగాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. లైసెన్స్ కలిగిన వ్యాపారులతో కొనుగోలు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు బజార్లలో కూడా ఉల్లి కొనుగోలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్కెట్ కమిటీ సెక్రటరీని ఆదేశించారు. వ్యాపారులు నాణ్యత పేరుతో మరీ తక్కువ ధరకు కొంటే ఎలా అని కలెక్టర్ వ్యాపారులను ప్రశ్నించారు. నాణ్యత పేరుతో రైతులకు అన్యాయం చేయొద్దని, వారికి అండగా నిలువాలని సూచించారు. మహారాష్ట్ర ఉల్లి చాలా ఉండటం వల్ల, వర్షాల వల్ల నాణ్యత లేకపోవడం వల్ల ఇతర రాష్ట్రాలకు ఎగుమతి కావడం లేదని వ్యాపారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఉల్లి నాణ్యతను పరిశీలించామని, కొంత బాగానే ఉందని కలెక్టర్ చెప్పారు. నాణ్యత పేరుతో 4 రూపాయలకు, 5 రూపాయలకు కొంటే ఎలా అని కలెక్టర్ ట్రేడర్లను ప్రశ్నించారు. ధరల విషయంలో సహేతుకంగా వ్యవహరించాలని కలెక్టర్ వ్యాపారులకు సూచించారు. రైతులు ఉల్లిని లేట్ ఖరీఫ్ లో సాగు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. కోడుమూరు లో ఉల్లి విక్రయాలు జరిగేలా మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు ను ఆదేశించారు. గతంలోనే ఈ అంశంపై చర్చించి, ప్రతిపాదనలు పంపాలని సూచించమని, వెంటనే ఎస్టిమేట్స్ వేయించి పంపాలన్నారు. సి బెళగల్, కోడుమూరు, గూడూరు తదితర మండలాల రైతులకు దూరం తగ్గి, ఖర్చులు తగ్గుతాయని కలెక్టర్ తెలిపారు. ఆదోని మార్కెట్ యార్డ్ లో పనులు నెమ్మదిగా సాగడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తి కాకపోవడం ఏంటని మార్కెటింగ్ ఏడీని ప్రశ్నించారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్ పర్సన్ అజ్మత్ బీ, హార్టికల్చర్ ఏడీ రామాంజనేయులు, మార్కెటింగ్ ఏడీ నారాయణ మూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ జయలక్ష్మి, ఆర్డీవో సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో "ఓపెన్ ఫోరం" కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు పౌరులు ఎల్ఆర్‌యస్, నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణాలపై అర్జీలు సమర్పించారు. పలువురు సందేహాలను వ్యక్తం చేయగా, కమిషనర్ నివృత్తి చేశారు. కొన్ని సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని పౌరులు కూడా కమిషనర్ దృష్టికి తీసుకోరాగా, అక్కడిక్కడే పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులను కారణాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కర్నూలు నగరంలోని ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు "ఓపెన్ ఫోరం" కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పౌరులకు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా వచ్చి చెప్పవచ్చన్నారు. ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ సమస్యలను ప్రజలు చెప్పాలని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను వెంటనే ఆదేశిస్తున్నానని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులు వేగవంతమైన సేవలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డీపీపీ బి.వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న, బిల్డింగ్ ఇంస్పెక్టర్లు, ప్లానింగ్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు





మనగళం, కల్లూరు : వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధ మధ్య సాగుతున్నాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. కే నాగలాపురం, ఎన్టీఆర్ కాలనీలో కొలువైన బొజ్జ గణపయ్యకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు బండారి వెంకటేశ్వర్లు, బండారు సురేష్, మహేష్, రామ గిడ్డయ్య, తెలుగు పవన్, మహేష్, రామ్మోహన్, తలారి సురేష్, పురుషోత్తం, లక్ష్మన్న, కురువ మధు, దుప్పటి మోహన్, ఎదురుపాటి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఉత్పత్తిదారుల సంస్థలు అభివృద్ధి చెందాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పీఓ) మరింత సమర్థవంతంగా పనిచేసేలా అభివృద్ధి చెందాల్సి ఉందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో రైతు ఉత్పత్తిదారుల సంస్థల అభివృద్ధి, సమర్థవంతమైన పనితీరుపై జిల్లా కలెక్టర్ జిల్లా పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 28 మాత్రమే ఎఫ్ పీఓ లు ఉన్నాయని, ఈ సంఖ్య మరింత పెంచాలని అధికారులకు సూచించారు. పంటల వారీగా ఎఫ్ పీఓలు ఏర్పాటు చేస్తే మార్కెటింగ్ సులభం అవుతుందన్నారు. చిరుధాన్యాలు, ఆర్గానిక్, ప్రకృతి వ్యవసాయం, టమోటా, ఉల్లి రైతులు, ఇలా ఒక్కో పంట, ఐటమ్ వారీగా ఎఫ్ పీఓలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న ఎఫ్ పీఓ లు కోల్డ్ స్టోరేజ్, ఫెర్టిలైజర్ అమ్మకాల లాంటి పరిమితమైన కార్యక్రమాలు మాత్రమే చేస్తున్నారని, అలా కాకుండా ఎఫ్ పీఓ ల ద్వారా రైతుల ఆదాయం వృద్ధి చెందేలా మరింత విస్తృతంగా కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని నాబార్డ్ డీడీఎం, ఎల్డీఎం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందు కోసం ప్రభుత్వ పథకాలు ఏమైనా ఉంటే వాటిని వినియోగించు కునేలా అధికారులు ఎఫ్ పీఓ లను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. పంటల వారీగా ఎఫ్ పీఓ లను ఏర్పాటు చేసి, వాటిని మార్కెటింగ్ వ్యవస్థ కు అనుసంధానం చేయాలన్నారు. అదే విధంగా స్థానికంగా ఉన్న స్టోర్ లను ఎఫ్ పీఓ లను కలిపి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసినట్లయితే, మార్కెటింగ్ సులభంగా చేసుకోవచ్చని తెలిపారు. ఉల్లి, మిర్చి, టమోటో తదితర పంటలను తరలించేందుకు ఎఫ్ పీఓ లకు బ్యాంక్ ల ద్వారా రుణాలు ఇప్పించి వాహనాలు ఇప్పించగలిగితే, తద్వారా ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి మండలంలో ఒక రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పీఓ) లను ఏర్పాటు చేసి, వారికి కోల్డ్ స్టోరేజ్ యూనిట్ లు ఇచ్చినట్లయితే, అక్కడ స్టోర్ చేసుకున్న కూరగాయలను ప్రభుత్వ వసతి గృహాలకు సరఫరా చేయవచ్చన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి, ఎల్డీఎం రామచంద్ర రావు, వ్యవసాయ శాఖ అధికారులు, ఎఫ్ పీఓ ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సజావుగా చెల్లించేలా సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : చట్ట ప్రకారం జీఎస్టీ సజావుగా చెల్లించేలా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జీఎస్టీ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి పన్ను చెల్లింపు దారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ కు సహకరించాలని అధికారులను ఆదేశించారు. రిజిస్టర్ చేసుకోకుండా వ్యాపారాలు చేసేవారు, కాంట్రాక్టర్లను రిజిస్ట్రేషన్ చేయించి జిఎస్టి పన్ను చెల్లించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీస్ డిపార్ట్మెంట్, ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, ఆర్టీసీ, మున్సిపల్ కార్పొరేషన్, అలాగే ఇంజనీరింగ్ శాఖలు ఆయా శాఖలకు సంబంధించిన జిఎస్టి పన్ను సక్రమంగా చెల్లించేలా చూడాలన్నారు. అదే విధంగా ప్రైవేట్ సంస్థలు, ఔట్సోర్సింగ్, ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులు ప్రొఫెషనల్ టాక్స్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నీరజ, అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, డిప్యూటీ కమిషనర్ మురళీమోహన్ , జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, డ్వామా పిడి వెంకట రమణయ్య, డి టి సి శాంతకుమారి,డి డి మైన్స్ రవిచంద్ర, పి ఆర్ ఎస్ ఈ మద్దన్న, ఎల్ డి ఎం రామచంద్ర రావు, కర్నూల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, ఆదోని మున్సిపల్ కమిషనర్, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్లు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడిలోకి చేరిన గణనాథుడు.



మన గళం అవుకు : నంద్యాల జిల్లా అవుకులో శుక్రవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా ముగిసినది. పట్టణంలోని మండపం వీధి, అమ్మవారి శాల, బస్టాండ్, తేరు వీధి, చాకలి దిగువపేట,తదితర చోట వినాయకుల నిమర్జనం సందర్భంగా వేకువ జామున నుండి స్వామివారికి అర్చనలు, ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు.కొలువుతీరిన గణనాధులను కమిటీ సభ్యులు , భక్తులు మేళ తాళాలతో, నృత్యాలతో స్వామివారిని పట్టణ పురవీధులలో ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక రిజర్వాయర్లో నిమజ్జనం చేశారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో ఎక్కడ ఎటువంటి అల్లర్లు జరగకుండా ఎస్సై రాజారెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

అణుపరీక్షలు వద్దు శాంతి చర్చలే ముద్దు

ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ఆగస్టు 29, 2009 అంతర్జాతీయ అణుపరీక్షకు వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించింది. ఇది అణుపరీక్షల గురించి అవగాహన కల్పించడానికి, అణుఆయుధాలు లేని ప్రపంచాన్ని సాధించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడమే లక్ష్యం గా జరుపుకుంటారు. అణుపరీక్షలోని పేలుళ్ళు, ఇతర అణుపేలుళ్ళ ప్రభావాల గురించి, అణ్వాయుధ రహిత ప్రపంచం లక్ష్యాన్ని సాధించే సాధనాల్లో ఒకటైన ఈ అణుపరీక్షలను నిలిపివేయవలసిన అవసరాన్ని గురించి 'అవగాహన పెంచాలని ప్రపంచం దేశాలకు పిలుపునిచ్చింది. మనిషి అభివృద్ధి చెందుతూ అంతరాళం చుట్టి వస్తున్న ఇర్ష్యా, ద్వేషం, స్వార్థంతో తనకుతానే శత్రువుగా మారిపోయి అణుబాంబుతో రాక్షసుడయ్యాడు. ఇంటికి పొరుగింటికి పడదు, దేశం పొరుగు దేశానికి గిట్టదు, నిత్యం కయ్యంతో కాలు దువ్వుతూ రోజుకొక యుద్ధంతో ప్రపంచ ప్రజలు భయం నీడలో బతుకుతున్నారు. శత్రువు తలవంచకపోతే శత్రువునే కరిగించాలి అన్న అమెరికా పట్టుదలతో 1945 ఆగస్టు 6, 9న అమెరికా ప్రయోగించిన బాంబులు హిరోషిమా, నాగసాకి నగరాలను ఒక క్షణంలో శ్మశానంగా మార్చేసింది.ఆ రోజు సూర్యుడు ఉదయించకముందే, మానవ జాతి మీద అణు అంధకారం కమ్ముకుంది. కానీ కాలిపోయింది శత్రువు కాదు, మానవత్వమే. బతికిపోయిన వారూ జీవచ్ఛవాల్లా మిగిలారు. క్షణాల్లో లక్షలాది ప్రాణాలు బూడిద, వేలాది ఇళ్లు శిథిలాలు, తరతరాల పిల్లల రక్తంలోకి చొరబడిన కిరణజన్య వ్యాధులు, వికలాంగతలు, మానసిక వేదన తరతరాల పాటు వారిని వెంటాడాయి. ఒక నగరాన్ని నిర్మించడానికి శతాబ్దాలు పడతాయి కానీ ఒక బాంబుపడితే క్షణాల్లో శ్మశానం అవుతుంది. హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా వేసిన రెండు అణుబాంబులు కేవలం జపాన్ నేలనే కాదు మనిషి హృదయాన్నే చీల్చేశాయి. మానవత్వం రాక్షసత్వమైన ఆ క్షణాన సూర్యుడు తలదించుకున్నాడు, గాలి విషమైంది, నీరు విషాదమైంది. ప్రకృతి శవాల విషదాలాపనతో మూగబోయింది. అప్పటి నుంచి మానవజాతి అణుఆయుధాల దారుణాన్ని, భయంకరతను అనుభవిస్తూ వస్తోంది. ఈ విధ్వంసం మనిషి సృష్టించిన మరో శస్త్రానికి లేదు. ఈ దారుణం తర్వాత అణు యుద్ధం అంటే దేశాల మధ్య యుద్ధం కాదు, మానవజాతి మీదే యుద్ధం అని ప్రపంచం నేర్చుకుంది. అయినప్పటికీ చాలా దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొని ఉన్నాయి. అయిన దేశాలు అణు పరీక్షలతో పొరుగు దేశాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

నేటికీ ప్రపంచంలో 13,000కు పైగా అణుబాంబులు సిద్ధంగా ఉన్నట్లు అనాధికార లెక్కలు భయపెడుతున్న నిజం. అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి దేశాలు ముందువరుసలో ఉండగా చిన్న దేశాలు కూడా భద్రత పేరిట అణుశక్తి వైపు పరుగులు పెడుతున్నాయి. నక్కల మధ్య మేకలా బతకలేమంటూ మరిన్ని దేశాలు అణుబాంబుల తయారీకి తెరతీస్తున్నాయి. ఈ మధ్యకాలంలో ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో పుతిన్ అణు బటన్ నొక్కే పరిస్థితి వస్తే వెనకాడం అన్న మాటతో ప్రపంచం ఒక్కసారి ఉలిక్కిపడింది. ఉత్తర కొరియా తన బాంబులతో పొరుగు దేశాలపై భయాలు సృష్టిస్తోంది. చైనా వేగంగా తన అణు ఆయుధాల నిల్వ పెంచుకుంటోంది.దక్షిణ చైనా సముద్రం, తైవాన్ సమస్యల వల్ల అంతర్జాతీయ ఉద్రిక్తత పెరుగుతోంది. ఉత్తర కొరియా వరుస అణు పరీక్షలతో పొరుగు దేశాలను బెదిరిస్తోంది. భారత్ -పాకిస్తాన్ రెండూ అణు దేశాలు కాబట్టి నిత్యం జరిగే సరిహద్దు ఘర్షణలలో ఒక్క తప్పు నిర్ణయం జరిగితే మానవజాతే బూడిద అవుతుంది. పాకిస్తాన్ అణుబాంబు ఉన్నదనే గుడ్డి నమ్మకంతో ఎదో ఒక రకంగా మన దేశంపైకి కాలు దువ్వుతున్నది.మనం శాంతిని కోరుకుంటున్నందున పాకిస్తాన్ ఊపిరి పీల్చుకుంటుంది. కానీ ఆయుధ సంపత్తికి కొదవలేని దేశం మనది అయినా మనకు మానవజాతి సుఖశాంతులే ముఖ్యం. ఇరాన్ కూడా అణు ఆయుధాలు తయారు చేస్తుందనే అనుమానాలు ఆంక్షల నేపథ్యంలో ఇజ్రాయెల్- పాలస్తీనా మధ్య యుద్ధాలు, మధ్యప్రాచ్యంలో ఎప్పుడైనా అణుఘర్షణ మంటలు రగులుతాయన్న భయం ఉంది. ఇవన్నీ ఒకే మాట చెబుతున్నాయి: బాంబులు పడితే ఎవరూ గెలవరు, మానవజాతి మొత్తం ఓడిపోతుంది. అణు బాంబు దేశాన్ని రక్షించదు, మానవజాతిని అంతమొందిస్తుంది. ఏ దేశాన్ని గెలిపించక మానవజాతిని శ్మశానంలో పడేస్తుంది. యుద్ధం మొదలైతే విజేతలేవరు కారు అందరూ పరాజితులే మిగులుతారు. మానవ జాతి మనుగడకు, పర్యావరణ, భవిష్యత్ తరాలకు శాపంగా నిలుస్తుంది. అన్ని దేశాలు అణు పరీక్షలు ఆపివేసి దేశాధినేతల మధ్య శాంతి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలి. మధ్యవర్తులుగా ఇతర దేశాధినేతలు, ఐక్యరాజ్య సమితి ఉండాలి .అణు బాంబులను నాశనం చేసి నిరాయుధీకరణ మార్గంలో నడవాలి. విద్య, విద్యుత్, వైద్యం, వ్యవసాయం, పరిశోధనల కోసం అణుశక్తి ఉపయోగించుకోవాలి కానీ యుద్ధం కోసం కాదు. అన్ని దేశాలు పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు ప్రేమ, సహనం, శాంతి విలువలు నేర్పాలి.

యువత శాంతి సైనికులుగా మారాలి తప్ప అణు సైనికులుగా కాదు. అంతర్జాతీయ సమగ్ర అణుపరీక్ష నిషేధ ఒప్పందం, అణు ఆయుధాలు వ్యాప్తి నిరోధక ఒప్పందాలు కేవలం సంతకాలకే పరిమితం కాకుండా చిత్తశుద్ధితో అమలు చేయాలి. అన్ని దేశాలలో ప్రజలు సోషల్ మీడియా, ఉద్యమాల ద్వారా అణు పరీక్షలకు వ్యతిరేక గళం వినిపించాలి. ప్రతి దేశం 'అణు ఆయుధాల రహిత ప్రపంచం' కోసం కృషి చేయాలి. అణుపరీక్షలను నిలిపివేయాలి, అణుపరీక్షలు శక్తి ప్రదర్శనకు సంకేతాలు మాత్రమే కానీ అవి మానవాళి ప్రాణాలకు శాశ్వత ముప్పు. అందుకే ఈ అంతర్జాతీయ అణుపరీక్ష వ్యతిరేక దినోత్సవం మనమంతా అస్త్రశక్తి కాదు, ఆలోచన శక్తితో మానవాళిని రక్షించుకోవాలి. యుద్ధం కాదు, శాంతి మాత్రమే భూమికి భవిష్యత్తు ఇస్తుంది అని విశ్వసించి ప్రతి దేశం అణు పరీక్షలను త్యజించి, శాంతి మార్గాన్ని ఎంచుకొని నిజమైన అభివృద్ధి సాధించాలి. అణు రహిత, భూమి శాంతి, సౌభ్రాతృత్వం నిండిన భూమిని బహుమతిగా భవిష్యత్ తరానికి అందివ్వాలి.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోపుట్ బాల్ ఫీల్డ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల





మన గళండోన్ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని డోన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ఫుట్‌బాల్ ఫీల్డ్‌ను గౌరవనీయులు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే కాకుండా, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి క్రీడలు ఎంతో కీలకమని అన్నారు. ప్రభుత్వం ప్రతి విద్యాసంస్థలో క్రీడా వసతులను విస్తరించడానికి కృషి చేస్తోందని తెలిపారు. డోన్ ప్రాంతంలో విద్యార్థులకు ఆధునిక క్రీడా సదుపాయాలు అందించడంలో ఈ ఫుట్‌బాల్ ఫీల్డ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఆటస్థలాలు, జిమ్‌లు, క్రీడా పరికరాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## కేంద్ర విశ్వవిద్యాలయం లో అడ్మిషన్లు ప్రారంభం






మన గళండోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ నందు ఈరోజు శుక్రవారం కేంద్ర విశ్వవిద్యాలయంలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువు విద్యార్థుల కోసం అడ్మిషన్లు ప్రారంభించడమైనది. చివరి తేదీ 8 - 9- 2025 ప్రకటించారు. కావున విద్యార్థుల యొక్క ఆధార్ కార్డు వివరాలతో 11- 9 - 2025న డ్రిప్ తీయబడును అని తెలిపారు. 12- 9- 25 న సెలక్షన్ లిస్టు బోర్డులో వేయబడును విశ్వవిద్యాలయంలో సెలెక్ట్ అయిన విద్యార్థులు 15- 9 - 25 నుండి 20 - 9 - 2025లో లోపు చేరాలని సంబంధిత అధికారులు మీడియాకు తెలిపారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి




మనగళం, ఓర్వకల్లు : సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సెట్కూరు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్ సూచించారు. ఓర్వకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్ నేరాలు, మత్తు పదార్థాలు- దుష్పరిణామాలు మొదలగు అంశాలపై జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్కూరు ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్కూరు సీఈఓ మాట్లాడుతూ ప్రపంచం నిరంతరం కొత్త టెక్నాలజీలతో అభివృద్ధి చెందుతూ, డిజిటల్ టెక్నాలజీ తో పని చేసే స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇంటర్నెట్, వాట్స్ ఆప్, పేస్ బుక్, ఇన్స్టాగ్రామ్ సాధారణం అయిపోయాయని చెప్పారు. అలాగే ఫోన్ నంబర్లను బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేసుకుని ఎప్పుడు కావాలంటే అప్పుడు నగదు లావాదేవీలు చేస్తూ ప్రతిఒక్కరు సైబర్ ప్రపంచంలో జీవిస్తున్నామన్నారు. ఈ డిజిటల్ టెక్నాలజీ ని ఉపయోగించి కొంతమంది సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు అధికారులమంటూ మభ్యపెడుతుంటారని, లింకు ను క్లిక్ చేయకూడదని హెచ్చరించారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో అమ్మాయిలు, మహిళల ను పరిచయాలు పెంచుకొని వారి వ్యక్తిగత వివరాలను సేకరించడం, చిత్రాలను, వీడియోలను, ఫోటోలను తీసుకొని మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తారనే విషయాన్ని గుర్తించి మెలగాలని సూచించారు. ఓర్వకల్ ఎంపిడిఓ శ్రీనివాసులు మాట్లాడుతూ వివిధ రకాలుగా సైబర్ నేరగాళ్లు మభ్యపెడుతుంటారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురువయ్య శెట్టి , కళాశాల అధ్యాపకులు, సెట్కూరు సిబ్బంది శ్ర కళా నిదీష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన సిపిఐ, సిపిఐ ( ఎం)

- బేతంచెర్ల పట్టణంలో త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలి
- పట్టణంలో ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలి
- మున్సిపల్ ఆఫీసులో జరిగే అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి
- వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నందు ధర్నా




మన గళంబేతంచర్ల నగర పంచాయతీ పరిధిలో ఆయా కాలనీలలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్ సిపిఎం మండల కార్యదర్శి మధుశేఖర్ ల ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్, సిపిఎం మండల కార్యదర్శి మధు శేఖర్, సిపిఎం సీనియర్ నాయకులు ఎల్లయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ లు మాట్లాడుతూ... పట్టణంలో నెలకొన్న త్రాగునీటి సమస్యలతో పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో బేతంచర్ల పట్టణంలో విష జ్వరాలు ప్రబలిపోయి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని నిత్యం దోమల ఈగల సంగీత వాయిద్యాలతో నరకయాతన చూస్తున్నారని సుమారు నెల రోజుల కిందట పట్టణంలో విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టి ఈగలు దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలి అని కమిషనర్ గారికి విన్నవించుకున్న ఈ రోజుకు కూడా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు ఏదైనా ధృవీకరణ పత్రాలు అవసరమై మున్సిపల్ కార్యాలయానికి వస్తే చిన్న పనికి సైతం నెలల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఉందని పట్టణంలో రెక్కాడితే కానీ డొక్కాడని దినసరి కూలీలు వారి పనిని వదిలిపెట్టి ఆఫీసులో చుట్టూ తిరిగి ఆర్థికంగా చితికి పోతున్నారని, చిన్న పనికి సైతం కార్యాలయంలో అవినీతి పెచ్చుమీరిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు, కుక్కల దాడుల్లో చిన్నపిల్లవాడు మరణించిన అనేకమార్లు కుక్కల దాడులు పునరావృతం అవుతున్న కుక్కలు నియంత్రిస్తున్నామని చెప్పి కేవలం ప్రకటనలతో కాలం వెళ్లబుచ్చుతున్నారని, మరోవైపు పందులు ఆవులు పట్టణ పురవీధుల గుండా తిరగడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతూ అనేక ప్రమాదాలు జరిగి కాళ్లు చేతులు విరకొట్టుకుని ఇల్లలో ఉండాల్సిన పరిస్థితి ఉందని మరికొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయే తీవ్రమైన పరిస్థితులు ఎదురవుతున్నాయని, అనేక కాలనీలలో లైట్లు వెలగక చీకట్లో ఎప్పుడు ఏ విషపురుగు కరుస్తుందని భయం గుప్పెట్లో ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని బ్రతకాల్సిన పరిస్థితి ఉందని పేద ప్రజల ప్రాణాలు అంటే లెక్క లేకుండా ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించే నాయకులను ప్రభుత్వ అధికారిక, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమాజ అభివృద్ధి కోసం పాటుపడే జర్నలిస్ట్, ప్రజాసంఘాల నాయకులను అనుచితంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు ప్రభుత్వ కార్యాలయాలలో పని నిమిత్తం వచ్చిన సాధారణ మధ్యతరగతి ప్రజలను గంటల తరబడి బయటనే నిలబెట్టి అధికార పార్టీ నాయకులను ఆఫీసుల్లో కూర్చోబెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే ప్రభువులు అన్న సిద్ధాంతానికి వ్యతిరేకంగా ప్రభుత్వ అధికారులను సైతం నాయకులు ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు ఇప్పటికైనా మున్సిపల్ పరిధిలో తిష్టవేసిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు నిరసన కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు ప్రదీప్, మధు, శ్రీకర్, ఫారుక్, ఖదీర్, శ్రీమన్నారాయణ, బాలు, గోపి, కార్తీక్, ప్రసాద్, మహమ్మద్, నాగసాయి, మధు, రామాంజనేయులు, ఖాజా హుస్సేన్, ఎస్ కే భాష, మద్దిలేటిస్వామి, నాగరాజు, వెంకటరమణ, టింగు తదితరులు పాల్గొన్నారు.

శనివారం
30 - 08 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# అఖండ 2 ప్రోగ్రెస్...



మన గళం: : నందమూరి అభిమానులు విపరీతమైన ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తున్న అఖండ 2 విడుదల సెప్టెంబర్ 25 ఉండదనే క్లారిటీ దాదాపు వచ్చినట్టే. నిజానికి ఈ డేట్ ని ఎలాగైనా చేరుకోవాలనే లక్ష్యంతో దర్శకుడు బోయపాటి శీను తన రెగ్యులర్ స్టైల్ ని పక్కనపెట్టి మరీ షూటింగ్ వేగంగా చేశారు. బాలకృష్ణ పూర్తిగా సహకరించి సకాలంలో డబ్బింగ్ కూడా అయిపోగొట్టేసి టీమ్ కి టెన్షన్ లేకుండా చేశారు. అయినా సరే పోస్ట్ ప్రొడక్షన్ పనులతో పాటు విఎఫెక్స్ వర్క్స్ ఇంకా పెండింగ్ ఉండటంతో ఒత్తిడి తీసుకోవడం ఇష్టం లేక వాయిదా నిర్ణయం తీసుకున్నారని ఇన్ సైడ్ టాక్. కొత్త డేట్ ఇంకా ప్రకటించలేదు. అదే రోజు ఓజి ఉంది కాబట్టి పోస్ట్ పోన్ చేస్తున్నారనే ప్రచారంలో నిజం లేదనేది యూనిట్ చెబుతున్న మాట. దసరా సెలవులు ఉంటాయి కాబట్టి క్లాష్ ఉన్నా లేకపోయినా అఖండ 2 చూసే ఆడియన్స్ శాతం ఎంత మాత్రం తగ్గిపోదని అంటున్నారు. సరే దీని సంగతలా ఉంచితే రాజా సాబ్ వదులుకోబోయే డిసెంబర్ 5న అఖండ 2 రావొచ్చనే ప్రచారానికి ఇంకా అధికారిక ముద్ర పడాల్సి ఉంది. ఎలాగూ 2026 సంక్రాంతి ప్యాక్ అయిపోయింది కాబట్టి అప్పటిదాకా ఆగే ఛాన్స్ లేదు. పుష్ప 2, యానిమల్, అఖండ గతంలో డిసెంబర్ లోనే వచ్చి బ్లాక్ బస్టర్లు సాధించి రికార్డులు తుడిచిపెట్టాయి. సో అది ఖచ్చితంగా మంచి ఆప్షనే. ప్రమోషన్లు మాత్రం అఖండ 2కి ఇప్పట్లో మొదలుపెట్టేలా లేరు. ఒకవేళ డిసెంబర్ అయితే ఇంకా చాలా టైం ఉంది కాబట్టి వెయిట్ చేస్తారు. తమన్ పాటలు ఇంకా బయటికి రాలేదు. ఈసారి అదిరిపోయే ఆల్బమ్ ఉంటుందని ఫ్యాన్స్ చాలా ఆశలు పెట్టుకున్నారు. సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటించిన ఈ డివోషనల్ యాక్షన్ డ్రామాలో ఆది పినిశెట్టి విలన్ గా నటించాడు. రషెస్ చూసిన వాళ్ళు కంటెంట్ టెర్రిఫిక్ గా ఉందని, అఖండని మించి విజువల్స్ అదిరిపోయాయని అంటున్నారు. అదే నిజమైతే మాత్రం బాలయ్య విశ్వరూపానికి ఈసారి ఎలాంటి రికార్డులు బద్దలు కాబోతున్నాయో చూడాలి.

# రోహిత్ ఆనందానికి వర్షం బ్రేకులు



మన గళం: చాలా గ్యాప్ తర్వాత సోలో హీరోగా నారా రోహిత్ చేసిన సినిమా సుందరకాండ. నిజానికిది ఏడాది క్రితమే విడుదల కావాల్సింది. రకరకాల కారణాల వల్ల వాయిదా పడుతూ వినాయక చవితి పండక్కు మోక్షం దక్కించుకుంది. కంటెంట్ మీద కాన్ఫిడెన్స్ తో హైదరాబాద్ లో ముందు రోజే ప్రీమియర్లు వేయడం టాక్ పరంగా పనికొచ్చింది. చూసినవాళ్లు బాగుందని, మంచి ప్రయత్నమని మెచ్చుకోవడం సోషల్ మీడియాలో కనిపించింది. మరీ హిలేరియస్ కాదు కానీ ఉన్నంతలో నవ్వించడానికి టీమ్ పెట్టిన ఎఫర్ట్ సక్సెసయ్యిందని మెచ్చుకున్నారు. భైరవం కన్నా బెటర్ రివ్యూలు సుందరకాండకు కనిపించాయి. కానీ రోహిత్ ఆనందానికి వర్షం బ్రేక్ వేస్తోంది. తెలంగాణలో వర్షాలు భీకరంగా పడుతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి నుంచి ఆదిలాబాద్ తదితర ప్రాంతాల వైపు వాతావరణం వరదని మించి ఉంటోంది. హైదరాబాద్ తో పాటు ఇతర నగరాలకు రెడ్ అలెర్ట్ ఇచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో జనాలు థియేటర్ కు రావడం అంత సులభంగా ఉండదు. పైగా రోహిత్ కు మంచి టేస్ట్ ఉందనే అభిప్రాయం జనంలో ఉన్నా తనేమి ఓపెనింగ్స్ తీసుకొచ్చే క్రౌడ్ పుల్లర్ కాదు. బాగుందనే మాట మెల్లగా పాకితే జనం రావడం మొదలు పెడతారు. కానీ ఇప్పుడొచ్చిన డీసెంట్ టాక్ కలెక్షన్లుగా మారాలంటే వర్షాలు తెరిపినివ్వాలి. ఆంధ్రప్రదేశ్ లోనూ వర్షాలు పడుతున్నాయి. వినాయక మండపాలు సైతం ఇబ్బందులు పడుతున్న వైనం టీవీలో చూస్తున్నాం. పండగ ప్లస్ లాంగ్ వీకెండ్ కలిసి వస్తుందనే ఉద్దేశంతో బిజినెస్ మీద చాలా ఆశలు పెట్టుకున్న సుందరకాండ బృందానికి వర్షాలు షాక్ ఇస్తున్నాయి. రేపో ఎల్లుండో తగ్గితే శని ఆదివారాలు మెరుగైన ఆక్యుపెన్సీలు చూడొచ్చు. ప్రేమకథల్లో ఇప్పటిదాకా ఎవరూ టచ్ చేయని పాయింట్ తీసుకున్న దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి మొదటి ప్రయత్నంలో మంచి ప్రశంసలే అందుకున్నాడు. మరి అవి వసూళ్లుగా మారతాయో లేదో సోమవారానికి క్లారిటీ వచ్చేస్తుంది. చూద్దాం.

# ఫ్యాన్స్ అడిగింది ఇచ్చేలా



మన గళం: ఓజి నుంచి ఇవాళ రెండో ఆడియో సింగల్ రిలీజయ్యింది. సువ్వి సువ్వి అంటూ స్మూత్ గా సాగే మెలోడీని తమన్ కంపోజ్ చేసిన తీరు, గాయని శృతి రంజని పాడిన విధానం రెండూ మ్యూజిక్ లవర్స్ ని వెంటనే కనెక్ట్ అయ్యేలా చేస్తున్నాయి. కళావతిలాగా టైం పట్టకుండా త్వరగా ఎక్కువ రీచ్ వచ్చే అవకాశం ఖాయంగా కనిపిస్తోంది. నిజానికి తమన్ స్థాయి పాట విని చాలా రోజులయ్యింది. ఓజి టైటిల్ సాంగ్ ఫ్యాన్స్ ని ఊపేసినప్పటికీ సాధారణ ప్రేక్షకులు మళ్ళీ మళ్ళీ వినాలనిపించే స్థాయిలో ఇంకా పూర్తి స్థాయిలో ఛార్ట్ బస్టర్ కాలేదు. కానీ ఇప్పుడీ సువ్వి సువ్వి క్లాసు, మాస్ తేడా లేకుండా అందరికీ చేరువయ్యేలా ఉంది.కల్యాణ చక్రవర్తి రాసిన లిరిక్స్ సింపుల్ గా టచింగ్ గా ఉన్నాయి. పల్లవికి చరణలకు మధ్యలో తమన్ వాడిన ఫ్లూట్ లాంటి వాయిద్యాలు ఒక నోస్టాల్జియా ఫీలింగ్ తీసుకొచ్చాయి. 90 దశకంలో సాగే స్టోరీ కాబట్టి ఆ మూడ్ కు తగ్గట్టు కంపోజ్ చేయడానికి తీసుకున్న శ్రద్ధ సాంగ్ లో బాగా వినిపించింది. విజువల్ గా రివీల్ చేసిన పవన్ కళ్యాణ్, ప్రియాంక మోహన్ కెమిస్ట్రీ బాగుంది. వయసు వ్యత్యాసం గురించి గతంలో కామెంట్స్ వచ్చినప్పటికీ ఆన్ స్క్రీన్ మాత్రం క్యూట్ పెయిర్ అనిపించేలా దర్శకుడు సుజిత్ డిజైన్ చేసిన విధానం బాగుంది. సో ఓజి నుంచి వచ్చిన రెండు పాటలూ సూపర్ హిట్టేనని చెప్పొచ్చు. సెప్టెంబర్ 25 విడుదల కాబోతున్న ఓజి హైప్ అప్పుడే ఎక్కడం మొదలయ్యింది. హరిహర వీరమల్లు గాయాన్ని పట్టించుకోకుండా ఫ్యాన్స్ అప్పుడే బెనిఫిట్ షో టికెట్ల కోసం మంతనాలు మొదలుపెట్టారు. తెలివిగా ప్లాన్ చేసుకున్న నార్త్ అమెరికా అడ్వాన్స్ బుకింగ్స్ లో అప్పుడే ఓజి ఆధిపత్యం కనిపిస్తోందని అక్కడి డిస్ట్రిబ్యూటర్ల టాక్.

# తేజ సజ్జ సినిమాకు బడా సంస్థల అండ





మన గళం: తేజ సజ్జ రొట్టె విరిగి నేతిలో పడేలా ఉంది. సెప్టెంబర్ 12 విడుదల కాబోతున్న ఈ విజువల్ గ్రాండియర్ కోసం ఇతర రాష్ట్రాల్లో బడా సంస్థలు రంగంలోకి దిగుతున్నాయి. హిందీ వెర్షన్ ధర్మ ప్రొడక్షన్స్ తరపున కరణ్ జోహార్ తీసుకోగా, కర్ణాటకలో కెజిఎఫ్ నిర్మాణ సంస్థ హొంబాలే ఫిలింస్ రంగంలోకి దిగింది. తమిళనాడులో ఏజిఎస్ సినిమాస్ ముందుకు వచ్చిందంటే థియేటర్ల పరంగా వచ్చే అతి పెద్ద సమస్య తీరినట్టే. మలయాళంలో గోకులం అండదండలు దొరకడమంటే మాములు విషయం కాదు. తెలుగు రాష్ట్రాల పంపిణీదారులు ఇంకో రెండు మూడు రోజుల్లో ఫైనల్ కాబోతున్నారు. మొత్తానికి ప్యాన్ ఇండియా స్కెచ్ పెద్దగానే ఉంది.హనుమాన్ తర్వాత తేజ సజ్జ మిరాయ్ కోసమే రెండేళ్లు ఖర్చు పెట్టుకున్నాడు. మధ్యలో చాలా ఆఫర్లు వచ్చినా ఒప్పుకోలేదు. మార్కెట్ ని పెంచుకునే లక్ష్యంతో వయసుకి మించి కష్టపడ్డాడు. బజ్ కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. ఈగల్ ఫేమ్ కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ ఫాంటసీ డ్రామాలో బలమైన డివోషనల్ ఎలిమెంట్ ఉందట. టీజర్ లో శ్రీరాముడు ఉండొచ్చనే హింట్ ఇచ్చారు కాబట్టి ఆ కోణం కనక సరిగ్గా వర్కౌట్ అయితే ఉత్తరాది ప్రేక్షకులు ఎగబడి చూస్తారు. నిఖిల్ కార్తికేయ 2 అంత బ్లాక్ బస్టర్ కావడానికి కారణం ఇదే. మిరాయ్ లోనూ అలాంటి అంశాలు పుష్కలంగా ఉన్నాయట. మిరాయ్ కి తొలి రెండు వారాలు కీలకం కాబోతున్నాయి. సెప్టెంబర్ 25 ఓజి వస్తుంది కాబట్టి ఆలోగానే తెలుగు రాష్ట్రాల్లో వీలైనంత రాబట్టుకోవాలి. పెద్ద మొత్తంలో పెట్టుబడులు పారుతున్న నేపథ్యంలో ఏపీ తెలంగాణలో ఓజికి అతి పెద్ద రిలీజ్ దక్కనుంది. ఒకవేళ మిరాయ్ కనక హనుమాన్ రేంజ్ టాక్ తెచ్చుకుంటే మూడో వారంలోనూ కొనసాగే ఛాన్స్ ఉంటుంది. సెప్టెంబర్ 12 రావాల్సిన దుల్కర్ సల్మాన్ తప్పుకోవడం మిరాయ్ కి కలిసి వచ్చే అంశమే. అదే రోజు విజయ్ ఆంటోనీ భద్రకాళి ఉంది కానీ దాన్ని మరీ పెద్ద కాంపిటీషన్ గా భావించాల్సిన అవసరం ఉండకపోవచ్చు. రేపు ట్రైలర్ తో అంచనాల లెక్కలు మారబోతున్నాయి.



# పేరు మార్చుకుని వచ్చిన మంచు లక్ష్మి

మన గళం: మోహన్ బాబు ఘన వారసత్వాన్ని కొనసాగిస్తూ మంచు ఫ్యామిలీ నుంచి వచ్చిన ముగ్గురు తారల్లో ఎవరి కెరీర్ కూడా ఆశించినంత గొప్పగా లేదు. గత దశాబ్ద కాలంగా ముగ్గురూ స్ట్రగులవుతూనే ఉన్నారు. చాలా గ్యాప్ తర్వాత 'కన్నప్ప' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విష్ణు.. కోరుకున్న విజయాన్ని అందుకోలేకపోయాడు. మంచు మనోజ్ రీఎంట్రీ మూవీ 'భైరవం' కూడా అంచనాలను అందుకోలేకపోయింది. మరోవైపు మంచు లక్ష్మి తెరపై కనిపించి చాలా కాలమైంది. ఆమె ఎప్పుడో పూర్తి చేసిన సినిమా 'అగ్నినక్షత్రం' సంగతి అసలేమైందో కూడా తెలియదు. ఐతే ఇప్పుడు సడెన్‌గా లక్ష్మి 'దక్ష' అనే సినిమా టీజర్‌తో పలకరించింది. ఐతే ఇదేమీ కొత్త సినిమా కాదు. 'అగ్నినక్షత్రం' చిత్రానికే పేరు మార్చారు. వినాయక చవితి కానుకగా ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. అది కొంచెం ఇంట్రెస్టింగ్‌గానే ఉంది. విచిత్రమైన వేషధారణతో హత్యలు చేసే ఒక కిల్లర్‌ను వెతికి పట్టుకునే పోలీసాఫీసర్ కథ ఇది. విలన్ పాత్రే సినిమాలో హైలైట్‌గా ఉండేలా కనిపిస్తోంది. ఇలాంటి క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్లు ఓటీటీల్లో బోలెడు చూస్తున్నాం. సినిమాలు కూడా పెరుగుతున్నాయి. ట్రెండుకు తగ్గ కథనే ఎంచుకుని రేసీ స్క్రీన్ ప్లేతో నడిపించాలని చూసినట్లున్నాడు దర్శకుడు వంశీకృష్ణ. లక్ష్మి పాత్ర పవర్ ఫుల్‌గానే కనిపిస్తోంది. ఒక డైలాగ్‌తో మాస్ చూపించింది లక్ష్మి. ఇందులో మోహన్ బాబు సైతం ఓ ముఖ్య పాత్ర పోషించాడు. టీజర్లో కొసమెరుపులా ఆయన పాత్ర కనిపించింది.

# కుబేర తర్వాత.. కమ్ముల మళ్లీ



మన గళం: కొందరు దర్శకులకు కొన్ని బేనర్లతో బాగా సింక్ కుదురుతుంది. గత చిత్రాల ప్రొడక్షన్ విషయంలో ఇబ్బందులు తలెత్తి ఉండొచ్చు లేదంటే కొత్త నిర్మాతలతో కంఫర్ట్ ఉండొచ్చు. కారణమేదైనా వరుసగా ఒక బేనర్లో సినిమాలు చేస్తుంటారు. నిర్మాణ సంస్థలు కూడా తమకంటూ ఆస్థాన దర్శకులు ఉండాలని కోరుకుంటాయి. దిల్ రాజు బేనర్లో ఇలా వరుసగా సినిమాలు చేసిన దర్శకులు చాలామందే ఉన్నారు. హారిక హాసిని సంస్థ ఎన్నో ఏళ్ల నుంచి త్రివిక్రమ్ శ్రీనివాస్‌తోనే సినిమాలు తీస్తోంది. త్రివిక్రమ్ కూడా బయటి బేనర్లకు సినిమాలే చేయట్లేదు. ఈ కోవలోనే శేఖర్ కమ్ముల కూడా ఒక సంస్థతో ట్రావెల్ చేస్తున్నాడు. అదే.. శ్రీ వెంకటేశ్వరా సినిమాస్ ఎల్ఎల్‌పీ. ఏషియన్ మూవీస్ అధినేత సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు కలిసి నడిపిస్తున్న సంస్థ. ఈ బేనర్లో కమ్ముల ఇప్పటికే రెండు సినిమాలు చేశాడు. తొలిసారి ఆ బేనర్లో చేసిన 'లవ్ స్టోరి' ఓ మోస్తరు ఫలితాన్నందుకోగా.. రెండో చిత్రం 'కుబేర' తెలుగు వరకు మంచి విజయాన్నే అందుకుంది. దీంతో మరోసారి ఈ నిర్మాణ సంస్థలో కమ్ముల సినిమా చేయబోతున్నాడు. వినాయక చవితి సందర్భాన్ని పురస్కరించుకుని కమ్ములతో తమ బేనర్లో మరో సినిమా చేయబోతున్న విషయాన్ని ఆ సంస్థ ప్రకటించింది. ఐతే ఇంతకుమించి సినిమా గురించి వివరాలేమీ వెల్లడించలేదు. ఈ ప్రాజెక్టు ఆరంభ దశలోనే ఉందని, కాస్ట్ అండ్ క్రూ గురించి తర్వాత వెల్లడిస్తామని పేర్కొన్నారు.

# నగరూరు ఇంట ఘనంగా వేడుకలు





మనగళం, కర్నూలు సిటీ : బీజేపీ రాష్ట్ర నేత, ఉమ్మడి కర్నూలు జిల్లా, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సుమన్ టీవీ పార్టనర్, మనగళం దినపత్రిక చైర్మన్, హీరా ఇన్ సర్వీస్ అపార్ట్ మెంట్ అధినేత నగరూరు రాఘవేంద్ర, నగరూరు హిమబింధు దంపతుల 12వ వివాహ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్ పర్సన్ నగరూరు శమంతకమణి తన కుమారుడు, కోడలు నగరూరు రాఘవేంద్ర, నగరూరు హిమబింధును ఆశీర్వదించారు. అనంతరం రాఘవేంద్ర, హిమబింధు దంపతులు నగరంలోని గోశాలకు వెళ్లి పూజలు నిర్వహించి గోవులకు ఆహారం అందజేశారు. అదేవిధంగా మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర, హిమబింధు దంపతులకు టీజీ వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కర్నూలు నగర పరిధిలోని నరసింహారెడ్డి నగర్ లోని స్వగృహంలో బంధువులు,మిత్రులు, సిబ్బంది మధ్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుమన్ టీవీ, మనగళం సిబ్బంది, హీరా ఇన్ సర్వీస్ అపార్ట్ మెంట్ సిబ్బంది, స్నేహితులు, బంధుమిత్రులు పాల్గొన్నారు



# సబలెంక, అల్కరాజ్ ముందంజ



మన గళం: ప్రతిష్మాత్మకమైన యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో రెండో సీడ్ కార్లొస్ అల్కరాజ్, ఆరో సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా) రెండో రౌండ్‌లో విజయం సాధించి ముందంజ వేశారు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్, డిఫెండింగ్ ఛాంపియన్ అరినా సబలెంక (బెలారస్), ఐదో సీడ్ మిరా అంద్రీవా (రష్యా) మూడో రౌండ్‌లో ప్రవేశించారు. ఏడో సీడ్ జస్మయిన్ పౌలిని (ఇటలీ), ఎలిసె మార్టెన్స్ (బెల్జియం) తదితరులు కూడా రెండో రౌండ్‌లో జయకేతనం ఎగు వేశారు. మార్టెన్స్ 62, 63తో లులు సున్ (ఆస్ట్రేలియా)ను ఓడించింది. పౌలిని కూడా అలవోక విజయంతో మూడో రౌండ్‌కు దూసుకెళ్లింది. అమెరికా క్రీడాకారిణి ఇవా జొవిక్‌తో జరిగిన పోరులో పౌలిని 63, 63తో జయభేరి మోగించింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన పౌలిని ఏ దశలోనూ ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇవ్వలేదు. చివరి వరకు దూకుడుగా ఆడి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. అంద్రీవా కూడా రెండో రౌండ్‌లో అలవోకగా నెగ్గింది. రష్యాకే చెందిన పొటపొవాతో జరిగిన పోరులో అంద్రీవా 61, 63తో విజయం సాధించింది. ప్రారంభం నుంచే అంద్రీవా తన మార్క్ ఆటతో ముందుకు సాగింది. కళ్లు చెదిరే షాట్లతో ప్రత్యర్థిని హడలెత్తించింది. చివరి వరకు జోరును కొనసాగిస్తూ ఎలాంటి ప్రతిఘటన లేకుండానే రెండు సెట్లను తన ఖాతాలో వేసుకుని మూడో రౌండ్‌లో ప్రవేశించింది. మరో మ్యాచ్‌లో వొంద్రుసొవా (చెక్) విజయం సాధించింది. అమెరికాకు చెందిన కెస్లర్‌తో జరిగిన రెండో రౌండ్‌లో వొంద్రుసొవా 76, 62తో జయకేతనం ఎగుర వేసింది. మరోవైపు టాప్ సీడ్ సబలెంక కూడా మూడో రౌండ్‌కు చేరుకుంది. రష్యాకు చెందిన పొలిన కుదెర్‌మెటొవాతో జరిగిన రెండో రౌండ్‌లో సబలెంక 76, 62తో విజయం సాధించింది. తొలి రౌండ్‌లో సబలెంకకు ప్రత్యర్థి నుంచి కాస్త పోటీ ఎదురైంది. అయితే టైబ్రేకర్‌లో సబలెంక సెట్‌ను దక్కించుకుంది. రెండో సెట్‌లో ఎలాంటి ప్రతిఘటన లేకుండానే విజయాన్ని అందుకుని మూడో రౌండ్‌లో ప్రవేశించింది.

పురుషుల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ కార్లొస్ అల్కరాజ్ అలవోక విజయంతో మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. రెండో రౌండ్‌లో అల్కరాజ్ 61, 60, 63తో ఇటలీకి చెందిన మట్టిచా బెల్లుసిపై విజయం సాధించాడు. ఆరంభం నుంచే అల్కరాజ్ దూకుడుగా ఆడాడు. తన మార్క్ షాట్లతో ప్రత్యర్థిని హడలెత్తించాడు. ఇదే క్రమంలో ఎలాంటి ప్రతిఘటన లేకుండానే వరుసగా మూడు సెట్లు గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. షెల్టన్ కూడా రెండో రౌండ్‌లో అలవోక విజయాన్ని అందుకున్నాడు. స్పెయిన్ ఆటగాడు కరెనొ బుస్టాతో జరిగిన పోరులో షెల్టన్ 64, 62, 64తో జయభేరి మోగించాడు. పూర్తి ఆధిపత్యం చెలాయించిన షెల్టన్ వరుసగా మూడు సెట్లు గెలిచి మ్యాచ్‌ను దక్కించుకున్నాడు. అయితే 11వ సీడ్ హొల్గర్ రూనే (డెన్మార్క్) రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. జర్మనీ ఆటగాడు స్ట్రఫ్‌తో జరిగిన ఐదు సెట్ల హోరాహోరీ సమరంలో పోరాడి ఓడాడు. ఇక ఐదో సీడ్ జాక్ డ్రాపర్ (బ్రిటన్) గాయం వల్ల టోర్నీ నుంచి వైదొలిగాడు. దీంతో అతని ప్రత్యర్థి బెర్గ్ మూడో రౌండ్‌కు చేరుకున్నాడు.

# ఇలా జరిగితే 9వసారి ఆసియా కప్ విజేతగా భారత్..



మన గళం: ఆసియా కప్ 2025 టోర్నమెంట్ సెప్టెంబర్ 9న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ గడ్డపై ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 10 నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో జరిగే మ్యాచ్‌తో భారత జట్టు ఆసియా కప్ 2025లో తన ప్రచారాన్ని ప్రారంభిస్తుంది. సెప్టెంబర్ 14న దుబాయ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. సెప్టెంబర్ 19న ఒమన్‌తో భారత్ తన మూడవ గ్రూప్ మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత సూపర్ ఫోర్ దశ ప్రారంభమవుతుంది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని 15 మంది సభ్యుల భారత జట్టు ఆసియా కప్ 2025 టోర్నమెంట్ కోసం సెప్టెంబర్ 4న దుబాయ్‌లో సమావేశమవుతుంది. ఈసారి భారత జట్టు ఆటగాళ్ళు ముంబై నుంచి కాకుండా.. వారి వారి ప్రదేశాల నుంచి నేరుగా దుబాయ్ చేరుకుంటారు. 2026 టీ20 ప్రపంచ కప్ వచ్చే ఏడాది భారత్, శ్రీలంకలో జరుగుతుంది. అందుకే, 2025 సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభమయ్యే ఆసియా కప్ టోర్నమెంట్ కూడా టీ20 ఫార్మాట్‌లో జరుగుతుంది. 2025 ఆసియా కప్ ట్రోఫీని గెలుచుకోవడానికి భారత్ బలమైన పోటీదారుగా మారాలని చూస్తోంది. భారత్ 8 సార్లు ఆసియా కప్ టైటిల్‌ను గెలుచుకుంది. ఇప్పుడు 9వ సారి ఛాంపియన్‌గా నిలిచేందుకు ప్రయత్నిస్తోంది. 2025 ఆసియా కప్‌లో భారత క్రికెట్ జట్టు 3 పనులు చేస్తే, ట్రోఫీని గెలవకుండా ఎవరూ ఆపలేరు. అవేంటో ఓసారి చూద్దాం..

1. హార్దిక్ పాండ్యా కొత్త బంతితో ఓపెనింగ్.. ఆల్ రౌండర్ గా హార్దిక్ పాండ్యా 2025 ఆసియా కప్‌లో భారత జట్టు తరపున కీలక పాత్ర పోషిస్తాడు. 2025 ఆసియా కప్ సమయంలో, ప్రతి మ్యాచ్‌లో ఫాస్ట్ బౌలర్ అర్ష్ దీప్ సింగ్‌తో పాటు హార్దిక్ పాండ్యాకు కొత్త బంతిని అందించడం ద్వారా బౌలింగ్ దాడిలో అతనిని ఉంచడం గొప్ప నిర్ణయం కావొచ్చు. హార్దిక్ పాండ్యా బ్యాట్‌తోనూ అద్భుతంగా రాణిస్తున్నాడు. బౌలర్లకు వ్యతిరేకంగా మైదానం ప్రతి మూలలో పరుగులు సాధించగల సామర్థ్యం అతనికి ఉంది. ప్రతి క్లిష్ట పరిస్థితిలోనూ భారతదేశం తరపున వికెట్లు తీయడంలో హార్దిక్ పాండ్యా కూడా నిష్ణాతుడు. హార్దిక్ పాండ్యా ఇప్పటివరకు భారతదేశం తరపున 114 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 27.88 సగటుతో 1812 పరుగులు చేశాడు. ఇందులో 5 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇది కాకుండా, హార్దిక్ పాండ్యా బంతితో అద్భుతాలు చేసి 94 వికెట్లు పడగొట్టాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్ లో 'ప్రత్యేకమైన సెంచరీ' వికెట్లు సాధించడానికి హార్దిక్ పాండ్యా కేవలం 6 వికెట్ల దూరంలో ఉన్నాడు.

2. సూర్యకుమార్ యాదవ్ నంబర్-3లో బ్యాటింగ్.. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన టీ20 బ్యాట్స్‌మెన్‌లలో సూర్యకుమార్ యాదవ్ ఒకరు. 2025 ఆసియా కప్‌ను భారత్ గెలవాలంటే, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఈ టోర్నమెంట్‌లో నంబర్-3 స్థానంలో బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. సూర్యకుమార్ యాదవ్ అనేక కీలక సందర్భాలలో నంబర్-3 స్థానంలో బ్యాటింగ్ చేయడం ద్వారా టీ20ఐ మ్యాచ్‌లలో భారత్‌కు దగ్గరి విజయాలు అందించాడు. టీ20ఐలో నంబర్-3 స్థానంలో బ్యాటింగ్ చేయడం సూర్యకుమార్ యాదవ్‌కు ఇష్టం. సూర్యకుమార్ యాదవ్ 200 స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేసే తుఫాన్ బ్యాట్స్‌మన్. టీం ఇండియా తరపున సూర్యకుమార్ యాదవ్ 83 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 2598 పరుగులు చేశాడు. ఇందులో 237 ఫోర్లు, 146 సిక్సులు ఉన్నాయి. టీ20 ఇంటర్నేషనల్‌లో సూర్యకుమార్ యాదవ్ 4 సెంచరీలు, 21 హాఫ్ సెంచరీలు సాధించాడు.

3. కుల్దీప్ యాదవ్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో ఛాన్స్.. 2025 ఆసియా కప్ ట్రోఫీని భారత్ గెలవాలంటే, ఈ టోర్నమెంట్‌లోని ప్రతి మ్యాచ్‌లోనూ ప్లేయింగ్ ఎలెవన్‌లో కుల్దీప్ యాదవ్ వంటి మ్యాచ్ విన్నింగ్ స్పిన్నర్‌కు అవకాశం ఇవ్వాలి. కుల్దీప్ యాదవ్ డేంజరస్ స్పిన్ వైవిధ్యాలు బ్యాట్స్‌మెన్‌కు పీడకలగా మారుతుంటాయి. కుల్దీప్ యాదవ్ టీ20 ఫార్మాట్‌లో గొప్ప రికార్డును కలిగి ఉన్నాడు. కుల్దీప్ యాదవ్ 40 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 14.07 బౌలింగ్ సగటుతో భారత జట్టు తరపున 69 వికెట్లు పడగొట్టాడు. ఇందులో అతని ఉత్తమ బౌలింగ్ ప్రదర్శన 17 పరుగులకు 5 వికెట్లు. కుల్దీప్ యాదవ్ టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో రెండుసార్లు 5 వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ పవర్-ప్లే, మిడిల్ ఓవర్లలో చాలా ప్రమాదకరమైనవాడని నిరూపితమయ్యాడు.

# ఆసియా కప్‌లో ఓపెనర్ అయిపోయినట్టేనా?

మన గళం: మామూలు కొట్టుడు కాదది. ఎలాంటి ఉపమానాలు ఉపయోగించినా సరిపోదు. ఎలాంటి ఉపోద్ఘాతంతో వర్ణించినా సరిపోదు. ఎందుకంటే అతని బ్యాటింగ్ అలా ఉంది మరి. బీభత్సంగా బ్యాటింగ్ చేస్తుంటే ప్రత్యర్థి బౌలర్లు సైలెంట్ అయిపోతున్నారు. జస్ట్ చూస్తూ ఉండిపోతున్నారు. మైదానం బయట ఉన్న ప్రేక్షకుల మాదిరిగానే వారు కూడా ప్రేక్షక పాత్రకు పరిమితమవుతున్నారు. అలా ఆడుతున్న ఆటగాడు మరెవరో కాదు.. సంజు శాంసన్. కేరళ క్రికెట్ లీగ్ లో కొచ్చి బ్లూ టైగర్స్ తరపున సంజు శాంసన్ ఆడుతున్నాడు. ప్రస్తుతం అతడు భీకరమైన ఫామ్ లో ఉన్నాడు.. ఈ లీగ్ లో భాగంగా అదాని త్రివేంద్రం రాయల్స్ జట్టుతో జరుగుతున్న మ్యాచ్లో సంజు అర్థ శతకం చేశాడు. కేవలం 37 బంతుల్లోనే నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్ల సహాయంతో 62 పరుగులు చేశాడు. ఈ లీగ్ లో అంతకుముందు త్రిసూర్ టైటాన్స్ జట్టుపై 89.. కొల్లం జట్టుపై 121 పరుగులు చేశాడు. తద్వారా తన తిరుగులేని ఫామ్ తో టీమిండియా ఓపెనర్ స్థానానికి గట్టి పోటీ ఇస్తున్నాడు సంజు. సంజు పరిమిత ఓవర్ల క్రికెట్లో అదరగొడతాడు. ఇటీవల ఐపీఎల్లో గాయం బారిన పడ్డప్పటికీ.. త్వరగానే కోలుకున్నాడు. ఇటీవల ఐపీఎల్లో రాజస్థాన్ జట్టు అంతగా ఆకట్టుకోలేకపోయింది. సంజు గాయపడిన నేపథ్యంలో అతడు జట్టుకు దూరమయ్యాడు. చివరికి గాయం నుంచి కోలుకుని సూపర్ ఫామ్ అందుకున్నాడు. త్వరలో జరిగే ఆసియా కప్ లో అతడు ఆడబోతున్నాడు. అయితే ఇప్పుడున్న ఫాం ప్రకారం అతడిని ఓపెనర్ గా తీసుకుంటారా.. లేదా సెకండ్ లేదా థర్డ్ పొజిషన్లో ఆడిస్తారా అనేది తేలాల్సి ఉంది. ఇక ఇటీవలి దక్షిణాఫ్రికా సిరీస్లో సంజు బీభత్సమైన ఆట తీరు కొనసాగించాడు. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయి అదరగొట్టాడు. కొద్దిరోజుల నుంచి సంజు తన ఫామ్ స్థిరంగా కొనసాగిస్తూనే ఉన్నాడు. ఐపీఎల్ మినహా మిగతా అన్ని సిరీస్లలో అదిరిపోయే ఆట తీరుతో ఆకట్టుకున్నాడు. జట్టుకు దూరం కావడంతో అతడిలో విపరీతమైన కసి పెరిగిపోయింది. దీంతో రోజా తరబడి నెట్స్ లోనే సాధన చేశాడు. తనను తాను నిరూపించుకున్నాడు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. తద్వారా తిరుగులేని ఆటగాడిగా మారిపోయాడు.. జట్టు మేనేజ్మెంట్ కు మరో అవకాశం లేకుండా చేశాడు.

# కోడుమూరు పట్టణంలో వైభవంగా జరిగిన వినాయకుని నిమర్జనం గణనాయకుని గంగమ్మ ఒడిలో చేర్చిన భక్తులు





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణము నందు గణనాయకుడు వినాయక చవితి పండగ సందర్భంగా పురవీధులలో కొలువుతీరి మూడు రోజులు వైభవంగా పూజలందుకొని మూడో రోజు అయిన శుక్రవారం సాయంత్రం 4:00 నుండి నిమజ్జన కార్యక్రమం మొదలైంది భక్తులంతా ఎంతో భక్తి భావంతో ఆ గణనాయకుని వైభవంగా కోడుమూరు పురవీధులలో దాదాపుగా 150 మండపాల నుండి గణనాయకులు మేళ తాళాలతో భాజా భజంత్రీలతో ఊరేగింపుగా పుర ప్రజలను ఆశీర్వదిస్తూ బయలుదేరాయి వినాయక ప్రతిమలను చూడడానికి ప్రజలు బారులు తీరారు ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా భక్తి భావంతో భక్తులంతా కలిసి ఆ గణనాయకుని వెంకటగిరి రోడ్డు నందు ఏర్పాటుచేసిన వినాయక ఘాటు నందు గణనాయకులను గంగమ్మ ఒడిలో చేర్చారు ఈ కార్యక్రమమునకు పోలీసు అధికారులు మరియు స్థానిక ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వాలంటరీలు వినాయక కమిటీ సభ్యులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి అందరూ కలిసికట్టుగా వినాయక నిమర్జనాన్ని ఎంతో ప్రశాంతంగా ముగించారు.





Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310